సాక్షి వికారాబాద్

ఆదివారం ꠰ 28 ꠰ జనవరి ꠰ 2024



ఆర్టీసీ ఆదాయానికి గండి!

ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు ప్రైవేటు వాహనాలతో నిండిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



గంజాయిపై గట్టి నిఘా

గంజాయి, మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రాములు హెచ్చరించారు. 8లో▸



పత్తికి దళారులే దిక్కు!

సీసీఐ కేంద్రంలో శనివారం నుంచి పత్తి కొనుగోలు నిలిపి వేయడంతో రైతులకు దళారులే దిక్కవుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ధారూరు మార్కెట్‌కు 750బస్తాల కందులు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 750 బస్తాల కందులు వచ్చాయని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. క్వింటాల్‌కు రూ. 9,920 నుంచి రూ. 10,075 వరకు అమ్మకాలు జరిగాయని పేర్కొన్నారు. అలాగే వామ క్వింటాల్‌కు రూ. 13,500 వరకు ధర పలికిందని వివరించారు.

పరిగి ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప టీం



పరిగి ఆస్పత్రి సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న కాయకల్ప టీం సభ్యులు

పరిగి: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శనివారం కాయకల్ప టీం సభ్యులు సందర్శించారు. సమర్థవంతంగా పారిశుద్ధ్య పనులు, శుచి, శుభ్రత, ఉత్తమ ప్రమాణాలు పాటించే ప్రభుత్వ ఆస్పత్రులకు జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కాయకల్ప అవార్డు ఇస్తారు. ఇందులో భాగంగా మేడ్చల్ డీసీహెచ్ఎస్ కోట్యానాయక్ తన సిబ్బందితో పరిగి ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి పలు అంశాలపై వివరాలు సేకరించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యం, పరిశుభ్రతపై ఆరా తీశారు. కార్యక్రమంలో అధికారులు ఉపేంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాల మేరకు బడ్జెట్ ఉండాలి

అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

షాద్‌నగర్: మున్సిపాలిటీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై శనివారం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మిషన్ భగీరథ అధికారులతో సమన్వయంతో పని చేసి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. తడిపొడి చెత్త వేరు చేసి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం నిర్మాణాత్మకంగా వంద శాతం చేపట్టాలన్నారు. పట్టణంలో ఆస్తి పన్నులను సకాలంలో వంద శాతం పూర్తి చేయాలని, పాత బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి పనులు, ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న, ఏఈ నర్సింలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి అన్నారు. వినోబాగనగర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏకాగ్రతతో చదివితేనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. ఇష్టపడి విద్యను అభ్యసిస్తే భవిష్యత్తుకు బంగారుబాట పడుతుందన్నారు. బాలికలు ఆపద వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి ధైర్యంగా ఉండాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవపడి కోర్టు చుట్టూ తిరిగి డబ్బు, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయంపై ప్రత్యేక దృష్టి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

షాద్‌నగర్: రైతులకు పారదర్శకంగా ఎరువులను విక్రయించేందుకు వ్యవసాయశాఖ కొత్త యాప్‌ను రూపొందించిందని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. పట్టణంలోని ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉండే నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతులకు రాయితీలపై ఎరువులను అందజేస్తోందని తెలిపారు. రైతులకు విక్రయించే ఎరువులు పక్కదారి పట్టకుండా, వ్యాపారులు కొరత సృష్టించకుండా ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రతి డీలర్ విధిగా ఆధార్‌కార్డు ఆధారిత వేలిముద్రతో విక్రయించాలని సూచించారు.

పైసలు లేక.. పనులు సాగక..!



పనులు పూర్తికాక అందుబాటులోకి రాని శివారెడ్డిపేట పాఠశాల భవనం

అసంపూర్తిగా 'మన ఊరు మన బడి' పనులు

- రూ.10 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు
- 30 పాఠశాలల్లో మాత్రమే వంద శాతం పనుల పూర్తి
- ప్రారంభానికి నోచుకోని మరో 160 పాఠశాలలు
- అరకొర వసతులతో విద్యార్థుల అవస్థలు

వికారాబాద్ అర్బన్: మన ఊరు మన బడి పథకానికి నిధుల కొరత వెంటాడుతోంది. పెండింగ్ బిల్లులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందా? లేదా అనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. దీంతో ఈ కార్యక్రమం అర్ధాంతరంగా ఆగిపోతుందా అనే అనుమానం సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను వెంటాడుతోంది. పాఠశాలల రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2022లో ప్రారంభమైన ఈ పథకం దశల వారీగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఎంపికైన పాఠశాలల్లో ఏడాది లోపు పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. అంటే 2023 జూన్ ఒకటో తేదీ నాటికి పనులు పూర్తి కావాలి. ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఈ పథకానికి నిధుల కొరత వెంటాడుతోంది. దీంతో అనుకున్న లక్ష్యం చేరలేక పోతోంది. గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో పనుల్లో జాప్యం జరిగిందనే ప్రచారం ఉంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా సకాలంలో నిధులు ఇచ్చి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

30 పాఠశాలల్లోనే పనులు పూర్తి

మొదటి విడత మన ఊరు మన బడి కింద జిల్లాలోని 371 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో భవనాలు, వసతుల కల్పనకు రూ.70కోట్ల 63లక్షల ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. కొన్ని పాఠశాలలకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు, మరి కొన్ని పాఠశాలల్లో రూ. 30 లక్షల నుంచి రూ. 40లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని నిర్ణయించారు. మొదటి దశలో రూ.7 లక్షల నుంచి రూ.30లక్షల లోపు ఖర్చు అయ్యే పాఠశాలను గుర్తించి పనులను ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం 30 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మరో 181 పాఠశాలల్లో 80శాతం పనులు పూర్తయ్యాయి. 160 పాఠశాలల్లో ఎలాంటి పనులు ప్రారంభానికి నోచుకోలేదు. మన ఊరు మనబడి పనులను ఎస్ఎంసీ చైర్మన్లు, గ్రామ సర్పంచులే అత్యధికంగా చేశారు. వారు సొంత డబ్బులు పెట్టి పనులు చేసినా సకాలంలో బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. మరి కొందరు పనులను మధ్యలోనే ఆపేశారు. చేసిన పనులకు డబ్బులు ఇస్తే మిగతా పనులను పూర్తి చేసేందుకు అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

భారీగా పెండింగ్ బిల్లులు

ముప్పై పాఠశాలల్లో మన ఊరు మన బడి పనులు వంద శాతం పూర్తి కాగా, 181 పాఠశాలల్లో 80శాతం పూర్తయ్యాయి. ఈ 181 పాఠశాలలకు సంబంధించి రూ.10 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ బిల్లులు వస్తే మిగతా 20శాతం పనులు పూర్తయ్యే అవకాశం ఉందని వారు అంటున్నారు. పనులు పూర్తయితే తప్ప విద్యార్థులకు వసతులు సమకూరే అవకాశం లేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత మేరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తుందనే దానిపై తేలాల్సి ఉంది. మన ఊరు మన బడిలో ఎంత మేరా పెండింగ్ బిల్లులు ఉన్నాయనే దానిపై ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు సమాచారం.

బిల్లుల కోసం నివేదిక పంపాం



మన ఊరు మన బడి పనులు పూర్తయితేనే విద్యార్థులకు మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. చాలా చోట్ల ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచులే పనులు చేస్తున్నారు. నిధులు ఉన్న వరకు పనులు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. బిల్లులు మంజూరు కాగానే మిగతా పనులను పూర్తి చేయిస్తాం.

– రేణుకాదేవి, డీఈఓ

వడ్డీకి తెచ్చి పనులు చేశా



మన ఊరు మన బడి కింద గ్రామంలోని పాఠశాలలో పనులు చేయించా. ఇందు కోసం వడ్డీకి డబ్బు తెచ్చా. ఆరు నెలలు పూర్తయినా పూర్తి స్థాయిలో బిల్లులు రాలేదు. ఇప్పటి వరకు రూ.7.80 లక్షలు ఇచ్చారు. మరో రూ. 2.50 లక్షల వరకు రావాల్సి ఉంది. త్వరగా డబ్బులు అందేలా చూడాలి. లేకుంటే వడ్డీ పెరిగే అవకాశం ఉంది.

– ప్రభు, కాంట్రాక్టర్, మాధారం



అనిల్‌కుమార్ జూకంటితో జిల్లా జడ్జిలు, న్యాయవాదులు

జిల్లా కోర్టుకు స్థలం ఇవ్వాలి

అనంతగిరి: జిల్లా కోర్టును హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో ఇన్‌చార్జ్ జడ్జి అనిల్‌కుమార్ జూకంటి సందర్శించారు. శనివారం కోర్టు భవనంలో జిల్లా జ్యుడీషియల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తులు ఆయా కోర్టుల్లో నెలకొన్న సమస్యలు, అక్కడి పరిస్థితులు, సౌకర్యాలను వివరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీకాంత్, శృతి దూత, తాండూరు, కొడంగల్ కోర్టుల న్యాయమూర్తులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు హైకోర్టు న్యాయ మూర్తి అనిల్‌కుమార్ జూకంటిని కలిసి జిల్లా కోర్టు నూతన భవన సముదాయ నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ పక్కన గల హార్టికల్చర్ స్థలం అనువైనదని జడ్జి దృష్టికి తెచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, సీనియర్ న్యాయవాదులు పరమానందరావు, యాదవరెడ్డి, గోపాల్‌రెడ్డి, బస్వరాజు, బి.శంకరయ్య, శ్రీనివాసరావు, వసుంధర, రమేష్‌గౌడ్, యాదయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

- ఇంటర్మీడియెట్ బోర్డు నోడల్ ఆఫీసర్ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

వికారాబాద్ అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియెట్ బోర్డు నోడల్ ఆఫీసర్ ఎస్ శంకర్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి ఒకటి నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని కళాశాలల్లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో కంప్యూటర్, ప్రింటర్‌తోపాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయని, విద్యార్థులకు ఈ సమాచారం ముందుగానే చేరవేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జనరల్‌లో 35, ఒకేషనల్‌లో 13 ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనరల్ ద్వితీయ సంవత్సరంలో 4,177 మంది సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో 1,352 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 1,259 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. విద్యార్థులందరూ పరీక్షలకు హాజరయ్యేలా చూడాలన్నారు.

అభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వండి

సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే బీ మనోహర్‌రెడ్డి కోరారు. శనివారం సచివాలయంలో సీఎంను కలిసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మంజూరు చేసిన పలు అభివృద్ధి పనులు రద్దు అయ్యాయని, వాటి స్థానంలో పనులు చేపట్టేందుకు తొలి విడతలో రూ.100 కోట్లు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో గత ప్రభుత్వాలు అభివృద్ధి చేయలేదని చెప్పారు. తమ ప్రాంతంలో రోడ్లు దారుణంగా ఉన్నాయని, వాటిని బాగు చేయాల్సి ఉందని తెలిపారు. మన్నెగూడ నుంచి తాండూరు మీదుగా జహీరాబాద్ వరకు నాలుగు లేన్ల రోడ్డు వేయాల్సి ఉందన్నారు. తమ ప్రాంతంలో నాపరాతి నిక్షేపాలు, సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. నాపరాయి దేశ, విదేశాలకు రవాణా జరుగుతోందన్నారు. ఈ ప్రాంతంలోని రోడ్లను బాగు చేస్తే నాపరాయి పరిశ్రమ మెరుగు పడుతుందని తెలిపారు. వికారాబాద్ జిల్లాకు తాండూరు నియోజకవర్గం ఆయువు పట్టని, ఆ ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరవుతాయని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్కను ఎమ్మెల్యే కలిశారు. తాండూరు అభివృద్ధికి నిధుల కావాలని కోరారు. దీంతో మంత్రి సంబంధిత అధికారులను పిలిపించి మాట్లాడారు. తాండూరు నియోజవకర్గ అభివృద్ధికి ఈజీఎస్, సీఆర్ఆర్, ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలు త్వరలో విడుదల అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే తాండూరు బైపాస్ రోడ్డు పనులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న తరుణ్‌కుమార్

యాలాల: ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటి పన్నులను ఈ నెలాఖరులోగా వందశాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్యతో కలిసి పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్నుల విషయంలో ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీల్లో రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు వీరప్ప, పావని, రాజు, వెంకటయ్య, సుధాకర్, కిరణ్, తారకచారి, లలిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అనిత

పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీఎల్‌పీఓ

మోమిన్‌పేట: ప్రతి గ్రామ పంచాయతీలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీఓ అనిత ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెల్‌చాల్ గ్రామ పంచాయతీ మినహా మిగతా గ్రామాల్లో 50శాతం లోపే పన్నులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పన్నులు వసూలులో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెల్‌చాల్ పంచాయతీలో 97శాతం పన్నులు వసూలు చేశారని తెలిపారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా రూ.81,08, 306లు వసూలు చేయాల్సి ఉందన్నారు. నేటి వరకు రూ. 37,51,490లు మాత్రమే వసూలు చేశారని తెలిపారు. నెల రోజుల్లో మిగతా రూ.43,56,816లు వసూలు చేయాలని ఆదేశించారు. మండలంలో రెండు మూడు పంచాయతీలు మినహా 30 శాతంలోపే పన్నులు వసూలు చేశారన్నారు. దీన్ని బట్టి గ్రామ కార్యదర్శుల పని తీరు ఎలా ఉందో అర్థమవుతుందని అన్నారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పారిశుద్ధ్యం, కంపోస్టు షెడ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ బక్కప్ప గౌడు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల మాయాజాలం



మిల్లర్ల నుంచి సేకరించిన సీఎంఆర్ రైస్

లేవీ స్థానంలో రీ సైక్లింగ్ చేసిన రేషన్ బియ్యం

- గతేడాది 40శాతం బియ్యం మిల్లర్ల వద్దే
- సేకరణలో అధికారుల తాత్సారం
- ప్రైవేటుగా అమ్ముకుంటున్న వైనం
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ

వికారాబాద్: మిల్లర్ల మాయాజాలం అటు ప్రభుత్వానికి ఇటు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. మిల్లర్ల అక్రమ దందాతో ప్రభుత్వానికి రూ. కోట్లలో నష్టం వాటిల్లుతోంది. లేవీ బియ్యం సేకరణలో అధికారులు చేస్తున్న తాత్సారం కూడా వారికి కలిసి వస్తోంది. అధికారులు మిల్లర్లతో కుమ్మక్కు కావడంతో ఈ తంతు సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొడంగల్‌లో ఓ రైసు మిల్లు యజమాని 50వేల బస్తాలు రైతుల నుంచి సేకరించి ఉడాయించడంతో తీవ్ర దుమారం రేగింది. ఇటీవల జరిగిన జెడ్పీ జనరల్ బాడీ సమావేశంలో మిల్లర్ల అక్రమ దందాపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మిల్లర్ల సంఘం అధ్యక్షుడుగా ఉన్న యాలాల ఎంపీపీ మిల్లర్లకు కొమ్ము కాస్తు మాట్లాడటంతో మిగతా సభ్యులు విరుచుకు పడ్డారు. ప్రభుత్వం వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ రూపంలో మిల్లర్లకు కేటాయిస్తోంది. వాటికి సంబంధించిన బియ్యం ఇవ్వడంలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లలో విక్రయిస్తూ బ్లాక్ మార్కెట్‌లో దొరికే రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి లేవీ రూపంలో ప్రభుత్వానికి అంటగడుతున్నారు. ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన ధాన్యం బయట రూ. 2,000 నుంచి రూ. 2,200 వరకు విక్రయిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో రూ.900 నుంచి రూ.1,200లకు లభించే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి రీ సైక్లింగ్ చేసి ప్రభుత్వానికి ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మిల్లర్లు మాత్రం క్వింటాలుకు రూ. 1000 నుంచి 2000 వరకు లాభం పొందుతున్నారు. దీంతో కోట్ల రూపాయలు అక్రమార్కుల జేబులోకి వెళుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై ఇటీవల జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే నివాసంలో మిల్లర్లు పంచాయితీ కూడా నిర్వహించగా పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం అక్కడికి వెళ్లి సంజాయిషీ ఇచ్చినట్లు సమాచారం.

లేవీ సేకరణలో తీవ్ర జాప్యం

అధికారుల నిర్లక్ష్యంతో లేవీ సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సీఎంఆర్‌లో భాగంగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయిస్తూ వస్తున్నారు. అయితే వారు సకాలంలో లేవీ బియ్యం ఇవ్వకపోడంతో ధాన్యం సేకరణకు అడ్డంకిగా మారుతోంది. ఈ మొత్తం వ్యవహారం చివరకు రైతుకు ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇవ్వాల్సిన లేవీ బియ్యం ఇప్పటి వరకు 50శాతం మాత్రమే పౌరసరఫరాల శాఖకు అందజేశారు. అధికారులతో కుమ్మక్కు కావడంతోనే మిల్లర్లు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గత ఏడాది వచ్చింది 50శాతమే

లేవీ సేకరణలో అధికారులు ఎంతలా వెనకబడి పోయారో ఈ గణాంకాలు చూస్తే అర్థమవుతుంది. 2022 –23 ఖరీఫ్, గతేడాది రబీకి సీజన్‌లో మిల్లర్లకు కేటాయించిన ధాన్యానికి సంబంధించి ఇప్పటి వరకు 60శాతం మాత్రమే లేవీ రూపంలో పౌరసరఫరాల శాఖకు అందజేశారు. మరో 40 శాతం మిల్లర్ల వద్దే ఉన్నాయి. మొత్తం ఈ రెండు సీజన్లలో 1,21,667 మెట్రిక్ టన్నుల బియ్యం లేవీ రూపంలో ప్రభుత్వానికి రావాల్సి ఉండగా 77,961 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు వద్దే ఉన్నాయి. ఓ పక్క గడువులోగా మిల్లర్ల నుంచి లేవీ రైస్ సేకరించాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా అధికారులు మాత్రం ఆ దిశగా చొరవ చూపడం లేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేవలం 20శాతం (45వేల మెట్రిక్ టన్నులు) ధాన్యం మాత్రమే సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా అందులో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ 45 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు.

క్లుప్తంగా

రేపు పరిగికి కేటీఆర్‌ రాక

పరిగి: బీఆర్‌ఎస్‌ కార్యకర్తల విస్తృత సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్‌ రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం పరిగి పట్టణ కేంద్రంలోని ఎస్‌ గార్డెన్‌లో మధ్యాహ్నం 2గంటలకు ఈ సమావేశం ఉంటుందని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యాలాల ఎస్‌ఐ అరవింద్‌ బదిలీ


ఎస్‌ఐ అరవింద్‌

యాలాల: యాలాల ఎస్‌ఐ అరవింద్‌ బదిలీ అయ్యారు. మండల పరిధిలోని కాగ్నా పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాకు చెక్‌పెట్టడంతో పాటు అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించే అధికారిగా పేరు సంపాదించారు. సుమారు 20 నెలల పాటు పనిచేసిన ఆయన్ను తాండూరు టౌన్‌ పీఎస్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు.

కొత్త ఎస్‌ఐగా శంకర్‌

యాలాల ఠాణాలో నూతన ఎస్‌ఐగా శంకర్‌ శనివారం విధుల్లో చేరారు. గతంలో ఆయన యాలాల పీఎస్‌లో మూడు నెలల పాటు విధులు నిర్వహించిన బొంరాస్‌పేట మండలానికి బదిలీ అయ్యారు. అనంతరం మళ్లీ యాలాల పీఎస్‌కే ఎస్‌ఐగా వచ్చారు.

సాగు పద్ధతుల ఆధారంగానే దిగుబడి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌

బొంరాస్‌పేట: రైతులు పంటల సాగులో ప్రధాన పొలంలో పాటించే పద్ధతుల ఆధారంగా దిగుబడి ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌ అన్నారు. శనివారం ఆయన బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో వరి, జొన్న పంటలను పరిశీలించారు. దుద్యాల మండలం నాజీఖాన్‌పల్లిలో వరినాట్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ యాసంగి వరిలో ప్రధానంగా పొలానికి ఎరరానికి 20కిలోల యూరియా, 50కిలోల డీఏపీ, 15కిలోల మ్యూరెట్‌ ఆఫ్‌ పొటాష్‌ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలని రైతులకు సూచించారు. యాసంగిలో జింకు ధాతులోపం ఎక్కువగా ఉంటుందని, ప్రధానంగా ఎకరానికి 20కిలోల జింకు, సల్ఫేట్‌ భాస్వరం, ఎరువులతో కలవకుండా దుక్కిలో వేసుకోవాలని సూచించారు. రేగడిపొలాల్లో పండించే ఆహార పంటల్లో తెల్ల జొన్న డిమాండ్‌ బాగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హేమ, సర్పంచ్‌ శకనప్ప, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌, కాశప్ప ఉన్నారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం

మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల


అలంపల్లిలో వార్డు సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్‌, కమిషనర్‌

వికారాబాద్‌ అర్బన్‌: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ వార్డును అభివృద్ధి చేస్తామని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల అన్నారు. శనివారం ఆమె కమిషనర్‌ జాకీర్‌ అహ్మద్‌తో కలిసి మున్సిపల్‌లోని పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని సమస్యలను తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ రమేశ్‌కుమార్‌, కౌన్సిలర్లు కిరణ్‌ పటేల్‌, రామస్వామి, సురేశ్‌గౌడ్‌, నాయకులు ఖాలెద్‌, ఆనంద్‌, హాజి, రాములు, డి.దీపు, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

షాద్‌నగర్‌: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఠాగూర్‌ పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి టాలెంట్‌ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... టాలెంట్‌ టెస్టులు విద్యార్థుల మేధస్సు ను పెంపొందిస్తాయన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలన, ఆసక్తిని రేకెత్తించడానికి సైన్స్‌ టాలెంట్‌ టెస్టులు దోహదపడుతాయని చెప్పారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి!

- బస్టాండ్‌ ఎదుటే నిలుపుతున్న ప్రైవేటు వాహనాలు
- పట్టించుకోని సంస్థ అధికారులు, పోలీసులు


పరిగి బస్టాండ్‌ ఎదుట నిలిపిన ప్రైవేటు వాహనాలు

పరిగి: ఆర్టీసీ బస్టాండ్‌ పరిసరాలు ప్రైవేటు వాహనాలతో నిండిపోతున్నాయి. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులను తమ వాహనాల్లో ప్రయాణం సాగించేలా యత్నిస్తున్నారు. జిల్లాలోని పరిగి, వికారాబాద్‌, తాండూరు, కొడంగల్‌ బస్టాండ్‌ల వద్ద ఇదే పరిస్థితి ఉంది. హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా కొడంగల్‌, పరిగి, తాండూరు బస్టాండ్ల ఎదుట అధికంగా క్రూజర్లు పెట్టి ప్రయాణికులకు ఎక్కించుకుంటున్నారు. బస్టాండ్‌ ఎదుట ప్రైవేటు వాహనాలను నిలిపి బస్టాండ్‌లోకి వెళ్లే ప్రయాణికుల వెంట పడుతూ తమ వాహనాల్లో ఎక్కించుకుంటున్నారు. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతుంది. కొంతమంది వాహనదారులు బస్టాండ్‌ లోపలికి వెళ్లి ప్రయాణికులను తమ వాహనాల్లో ఎక్కించుకుంటున్న సందర్భాలున్నాయి.

పనిచేయని నిబంధనలు

మోటర్‌ వాహనాల చట్టం ప్రకారం ఆర్టీసీ బస్టాండ్‌కు దాదాపు 500 మీటర్ల దూరంలో ప్రైవేటు వాహనాలు నిలపాలని నిబంధనలున్నప్పటికీ ఎవరూ పాటించడం లేదు. ఇదే సమాచారంతో ఏర్పాటు చేసిన బోర్డు వద్దే ప్రైవేటు వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో మహిళా ప్రయాణికులు పెరిగారు. బస్సులు సమయపాలన పాటించకపోవడంతో పురుషులు ఎక్కువగా ప్రైవేటు వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ఎదుటే బస్టాండ్‌కు ఎదురుగా ప్రైవేటు వాహనాలను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకున్నా పట్టించుకోకపోవడం సరికాదని పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని స్పెషల్‌ టీంలు.

గతంలో ఆర్టీసీ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి పోలీసుశాఖను భాగస్వామ్యం చేసింది. బస్టాండ్‌కు దాదాపుగా 500 మీటర్ల వరకు ప్రైవేటు వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్తగా ఏర్పడినప్పుడు బస్టాండ్‌కు దూరంగా ప్రైవేటు వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవడంతో ఆర్టీసీ లాభం చేకూరింది. కానీ కొన్ని నెలల పాటు పనిచేసిన టీంలు ఇప్పుడు నిర్వీర్యమయ్యాయనే పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నా పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. ప్రైవేటు వాహనదారులు ప్రయాణికులను ఎక్కువగా ఎక్కించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేటు వాహనాలతో ఆర్టీసీకి కలుగుతున్న నష్టానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రైవేటు వాహనదారులు బస్టాండ్‌కు 500 మీటర్ల దూరంగా నిలపాలి. నిబంధనలు పాటించని ప్రైవేటు వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ ప్రయాణమే సురక్షితం. బస్టాండ్‌ వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రైవేటు వాహనాలు బస్టాండ్‌ ఎదుట నిలపకుండా చర్యలు తీసుకుంటాం.

– కరుణశ్రీ, ఆర్టీసీ డీఎం, పరిగి

రోడ్డెక్కిన వేరుశనగ రైతులు


రైతుల ఆందోళనతో స్తంభించిన ట్రాఫిక్‌

మద్దతు ధర కల్పించాలని డిమాండ్‌

పరిగి: వేరుశనగ రైతులు రోడ్డెక్కారు.. మద్దతు ధర ఒక్కసారిగా దాదాపు రూ.2వేల వరకు తగ్గించడంతో శనివారం వారు హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మార్కెట్‌ యార్డు అధికారులు, దళారులు ఏకమై మోసం చేస్తున్నారని ఆరోపించారు. మద్దతు ధర కల్పించే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకున్నారు. పరిగి మార్కెట్‌ యార్డుకు రైతులు వేరుశనగ పంటను విక్రయించేందుకు తీసుకువచ్చారు. గత వారం క్వింటాల్‌కు రూ.8వేలకు పైగా ధర ఉండగా.. ఈ వారం రూ.6,200కు పడిపోయింది. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు పక్క మార్కెట్‌లో ఒక విధంగా.. పరిగి మార్కెట్‌లో మరో విధంగా ధర ఉంటుందా అని ప్రశ్నించారు. అన్ని మార్కెట్‌లో రేటు సమానంగా ఉండకుండా వ్యత్యాసం ఎందుకుంటుందని నిలదీశారు. రైతులకు అండగా ఉంటామన్న ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపచేశారు.

పేదలకు అండగా ఉంటాం

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: పేదలకు నిరంతరం అండగా ఉంటానని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐనాపూర్‌ గ్రామానికి చెందిన బుసని బాలరాజ్‌ ఆరు నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన శనివారం పార్టీ సభ్యత్వం ఉన్నట్లు తెలుసుకుని ఇన్సూరెన్స్‌ నుంచి మాజూరైన రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ పాలనలో రాష్ట్రాభివృద్ధి

ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

- సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో సమస్యలకు పరిష్కారం: ఎమ్మెల్యే శంకర్‌

కేశంపేట: బీఆర్‌ఎస్‌ పాలనలో రాష్ట్రం అభివృద్ధి సాధించిందని మహబూబ్‌నగర్‌ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కొత్తపేట గ్రామ పంచాయతీ భవనం, గౌడ సంఘం భవనం, సంతాపూర్‌లో అంగన్‌వాడీ భవనం ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. కేసీఆర్‌ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగిందన్నారు.

గత పాలనలో సర్పంచ్‌లకు ఇబ్బందులు

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాల అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారు. గత ప్రభుత్వం పాలనలో సర్పంచ్‌లకు నిధులు మంజూరు చేయకపోవడంతో సొంత ఖర్చులతో పనిచేసి ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సైతం బిల్లులు మంజూరు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట, సంతాపూర్‌ సర్పంచ్‌లు నవీన్‌కుమార్‌, అంజయ్య, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్‌ కమిటీ జిల్లా చైర్‌పర్సన్‌ తాండ్ర విశాలరెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు జగదీశ్వర్‌, మండల అధ్యక్షుడు గూడ వీరేశ్‌, అల్వాల, కొత్తపేట ఎంపీటీసీ సభ్యులు సురేష్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్‌, శ్రీధర్‌రెడ్డి, సుందరయ్య, ఆనంద్‌కుమార్‌, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

గంజాయి సరఫరాపై గట్టి నిఘా

- మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా కఠినచర్యలు
- రిమాండ్‌కు ముగ్గురు నిందితులు
- సీఐ రాములు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములు, ఎస్‌ఐ భరత్‌రెడ్డి

కొడంగల్‌ రూరల్‌: గంజాయి లాంటి మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ రాములు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పీఎస్‌లో తనిఖీలో పట్టుబడిన గంజాయి, సరఫరా చేస్తున్న నిందితుల వివరాలు వెల్లడించారు. శుక్రవారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామ సమీపంలో ఎస్‌ఐ భరత్‌రెడ్డి, హెడ్‌ కానిస్టేబుల్‌ శివరాములుగౌడ్‌, పోలీసు సిబ్బంది నరేందర్‌రెడ్డి, కృష్ణ, హెచ్‌జీ బాబు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో సేడం తాలూకా మొదీనా గ్రామానికి చెందిన భూషణప్ప(అఖిల్‌), అదే గ్రామానికి చెందిన నాగరాజు, కొడంగల్‌ మండలం రావులపల్లి గ్రామానికి చెందిన దస్తప్ప ముగ్గురు స్నేహితులు. వీరు శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని సేడం నుంచి కొడంగల్‌కు బైక్‌పై రెండు కిలోల గంజాయి (రూ.40వేల విలువ) తీసుకువస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. నిందితుల నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ స్వాధీనం చేసుకున్నారు. శనివారం ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌ తరలించినట్లు సీఐ రాములు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ భరత్‌రెడ్డి, హెడ్‌ కానిస్టేబుల్‌ శివరాములుగౌడ్‌, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్‌ పోలీసుల తనిఖీలు


పట్టణంలో ఓ సెలూన్‌లో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్‌ పోలీసులు

తాండూరు టౌన్‌: మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తాండూరు ఎక్సైజ్‌ సీఐ అనంతయ్య హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని కిరాణా దుకాణాలు, హెయిర్‌ కటింగ్‌ సెలూన్లు, టాటూ సెంటర్స్‌, షాపులు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిషేధిత పదార్థాలను విక్రయించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం పట్టణంలోని పలు అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేశామని, అయితే ఎలాంటి గంజాయి, మత్తు చాక్లెట్లు తదితర పదార్థాలు లభించలేదని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 87126 58754 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

సేవను మరిచి..

క్యాంపుల పేరుతో ప్రజలకు దూరం

- మూడు వారాలుగా ఫోన్లు స్విచ్ఛాఫ్‌
- స్పందించని కార్పొరేటర్లు, కౌన్సిలర్లు
- కుంటుపడిన అభివృద్ధి
- ఆదిబట్లకు నోటీసులు జారీ చేసిన కలెక్టర్‌
- ఇబ్రహీంపట్నం, బండ్లగూడ జాగీర్‌పై తర్జనభర్జన



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రజల చేత, ప్రజల కోసం ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఆ తర్వాత ప్రజాసేవను విస్మరిస్తున్నారు. రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తున్నారు. వారిని నమ్మి ఓట్లు వేసిన ఓటర్లు తీరా వారిపని తీరును చూసి పెదవి విరుస్తున్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని ప్రజలు సహజంగా తమ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు కాల్వల శుద్ధి, తాగునీటి సరఫరా, పార్కులు, వీధిలైట్ల నిర్వహణ, ఇతర సమస్యల పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఆశ్రయిస్తుంటారు. అధికారులు, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ ప్రజలకు సేవ చేయాల్సిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అవిశ్వాసాల పేరుతో 15 నుంచి 20 రోజులుగా అజ్ఞాతంలోనే ఉండిపోయారు. సమస్యలు చెప్పుకొనేందుకు స్థానికులెవరైనా ప్రయత్నిస్తే..కనీసం అందుబాటులో ఉండడం లేదు. చివరికి ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్‌ చేసేశారు. కార్పొరేషన్‌, మున్సిపాలిటీలోని మెజార్టీ సభ్యులు మున్సిపాలిటీకి దూరంగా ఉండటంతో కీలక నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి. ఫలితంగా ఆయా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

ఇబ్రహీంపట్నంలో ఇలా..

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీజేపీకి ఇద్దరు, కాంగ్రెస్‌కు ఆరుగురు, బీఆర్‌ఎస్‌కు 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కప్పరి స్రవంతిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ప్రస్తుతం 17 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ మేరకు జనవరి 8న అదనపు కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌కు నోటీసులు ఇచ్చి, ఆ వెంటనే 15 మంది (వీరిలో ఆరుగురు మహిళా కౌన్సిలర్ల తరఫున వారి భర్తలు) క్యాంపునకు వెళ్లిపోయారు. కలెక్టర్‌కు నోటీసులిచ్చి 20 రోజులైంది. ఆదిబట్ల మున్సిపాలిటీకి నోటీసులిచ్చిన కలెక్టర్‌ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ విషయంలో ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఒకవేళ చైర్‌పర్సన్‌ను మార్చాలని మెజార్టీ సభ్యులు భావిస్తే స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండి, తొలగించుకోవచ్చు. పట్నం కౌన్సిలర్లు మాత్రం తమకు ఓటు వేసి గెలిపించిన ఓటర్లను, వారి సమస్యలను గాలికొదిలేసి రోజుల తరబడి ఫోన్లు స్విచ్ఛాఫ్‌ చేసి ప్రజలకు దూరంగా ఉండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆదిబట్లలో అలా..

ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌ ఆర్తిక(కాంగ్రెస్‌)పై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు జనవరి 9న అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. మున్సిపాలిటీలో 15 మంది అభ్యర్థులు ఉండగా, వీరిలో 13 మంది నోటీసులపై సంతకాలు పెట్టారు. ఆ తర్వాత 12 మంది క్యాంపునకు వెళ్లారు. ఇటీవలే వారు తిరిగి ఇంటికి చేరుకున్నారు. మూడు రోజుల క్రితం మళ్లీ క్యాంపునకు వెళ్లారు. వీరంతా 18 రోజులుగా ప్రజలకు దూరంగా ఉంటున్నారు. కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసులపై కలెక్టర్‌ స్పందించారు. ఫిబ్రవరి 9న సమావేశం నిర్వహించనున్నట్లు మూడు రోజుల క్రితం మున్సిపాలిటీ సహా సభ్యులందరికీ సమాచారం అందజేశారు. కౌన్సిలర్ల తీరుపై స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా సీరియస్‌ అయ్యారు. వెంటనే క్యాంప్‌ను వీడి రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అయినా కౌన్సిలర్లు లెక్క చేయలేదు.

బండ్లగూడలో బాధలు

బండ్లగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌ మహేందర్‌గౌడ్‌పై 16 మంది (బీజేపీ నుంచి ఒకరు, కాంగ్రెస్‌ నుంచి ఇద్దరు, బీఆర్‌ఎస్‌ నుంచి 13 మంది) కార్పొరేటర్లు తిరుగుబావుటా ఎగరేశారు. ఇక్కడ మొత్తం 22 మంది కార్పొరేటర్లు ఉండగా, వీరిలో ఒకరు మృతి చెందారు. జనవరి 12న కలెక్టర్‌ శశాంకను కలిసి నోటీసులు అందజేశారు. అదే రోజు 16 మంది క్యాంపునకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌, గోవా, బెంగళూరు మీదుగా ప్రస్తుతం లక్నవరానికి చేరుకున్నారు. ఆరు నెలల కోసం అవిశ్వాస తీర్మానం పెట్టడం సరైన నిర్ణయం కాదని, క్యాంప్‌ నుంచి తిరిగి రావాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ వీరిపై ఒత్తిడి తెస్తున్నారు. అయినా వారు పట్టించుకోవడం లేదు. నోటీసులిచ్చి 16 రోజులవుతున్నా ఇప్పటికీ అవిశ్వాస తీర్మానానికి సమావేశ తేదీని నిర్ణయించలేదు. మెజార్టీ కార్పొరేటర్లు క్యాంపుల్లో ఉండటం, రోజుల తరబడి ఫోన్లు స్విచ్ఛాఫ్‌ చేసి ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. డివిజన్లలో పొంగిపొర్లుతున్న మురుగునీరు, తాగునీటి సమస్య, గుంతలు తేలిన రోడ్లు, వెలగని వీధిలైట్లు, వీధి కుక్కల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యలను చెప్పుకొనేందుకు కార్పొరేటర్లు అందుబాటులో లేకపోవడంపై వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సాహితీ సుగంధం!

విభిన్నం, వైవిధ్యం, హైదరాబాద్‌ సాహిత్యోత్సవం

- జ్ఞానాన్వేషణకు స్ఫూర్తినిచ్చే ఫుడ్‌ ఫర్‌ థాట్‌
- వైవిధ్యభరితమైన చిత్రకళా ప్రదర్శనలు

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న అంశాలపై సమావేశాలు, సదస్సులు.. ఇష్టాగోష్ఠులు, వైవిధ్యభరితమైన సాంస్కృతిక, చిత్రకళా ప్రదర్శనలు.. స్ఫూర్తినిచ్చే అద్భుతమైన కార్యక్రమాలతో హైదరాబాద్‌ లిటరరీ ఫెస్టివల్‌ శనివారం రెండోరోజు కన్నుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలు సందర్శకులను కట్టిపడేశాయి. ప్రత్యేక ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన చిత్రకళాకారులు అద్భుతమైన చిత్రాలను ప్రదర్శించారు. పిల్లలు, యువతీ యువకుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలకు కూడా అనూహ్యమైన స్పందన లభించింది. వివిధ రంగాలకు చెందిన రచయితలు, ప్రముఖులు, మేధావుల పుస్తకాలను ఈ సందర్భంగా ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న హైదరాబాద్‌ లిటరరీ ఫెస్టివల్‌ 14వ ఎడిషన్‌ ఈసారి హైటెక్‌ సిటీలోని సత్వ నాలెడ్జ్‌ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఒడియా భాషపై, నార్వే సాహిత్యంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ రెండు భాషలకు చెందిన సాహిత్యం, సాంస్కృతిక అంశాలు, కళలపై ప్రత్యేకంగా దృష్టి సారించి కార్యక్రమాలను రూపొందించారు.

ఆలోచింపజేస్తున్న 'ఫుడ్‌ ఫర్‌ థాట్‌'

'జ్ఞానం కోసం అన్వేషణ' అనే లక్ష్యంతో 8 ఏళ్లుగా పని చేస్తున్న 'ఫుడ్‌ ఫర్‌ థాట్‌' సంస్థ హైదరాబాద్‌ లిటరరీ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నవలలు, కామిక్స్‌, జనరల్‌ నాలెడ్జ్‌, సమకాలీన అంశాలు, కథలు తదితర అంశాలు, విభిన్న భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని పిల్లలకు అందజేసే లక్ష్యంతో ఫుడ్‌ ఫర్‌ థాట్‌ సంస్థ దేశవ్యాప్తంగా 600కు పైగా గ్రంథాలయాలను నిర్వహిస్తోంది. ఈ గ్రంథాలయాల్లో 70 శాతం ఇంగ్లిష్‌ లిటరేచర్‌ ఉంటే మరో 30 శాతం స్థానిక భాషల సాహిత్యం ఉంటుంది. విద్యార్థుల్లో పుస్తకపఠనం పట్ల అభిరుచిని, ఆసక్తిని పెంచేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు ఫుడ్‌ఫర్‌ థాట్‌ వ్యవస్థాపకులు షఫాలీరావు తెలిపారు. ఇప్పటి వరకు 25000 మందికి పైగా పిల్లలకు వివిధ అంశాలపైన సాహిత్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.

'పిల్లల్లో సృజనాత్మకతను పెంచాల్సిన అవసరం ఉంది. పట్టణ ప్రాంతాల్లో చదువుకుంటున్న వాళ్లకు పుస్తకాలు, లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి. కానీ వారిలో పఠనం పట్ల ఆసక్తి కొరవడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకోవాలనే తపన ఉంది. కానీ ఆ పిల్లలకు పుస్తకాలు అందుబాటులో లేవు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలకు చెందిన పిల్లలకు ఎక్కువగా అందుబాటులో ఉండేవిధంగా లైబ్రరీలను ఏర్పాటు చేశాం. హైదరాబాద్‌లో కూడా సాధారణ బస్తీల్లో నివసించే చిన్నారుల పుస్తకాల అవసరాన్ని తీర్చేందుకు లైబ్రరీలను ఏర్పాటు చేశాం' అని ఆమె చెప్పారు. ఫిబ్రవరి 10వ తేదీన అర్బన్‌ రీడింగ్‌ డెకథ్లాన్‌ పేరిట బిర్లా ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రీడింగ్‌ ఛాంపియన్‌లకు బహుమతులను అందజేయనున్నారు.



భళా.. చిత్రకళా..

హైదరాబాద్‌ లిటరరీ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు వేసిన బొమ్మలు, కళాకృతులతో ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన కూడా సందర్శకులను ఆకట్టుకుంటోంది. కేరళ, బెంగళూరు, కోల్‌కతా, హైదరాబాద్‌ తదితర ప్రాంతాలకు చెందిన ఆర్టిస్టుల చిత్రాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. గొంగడిపై హ్యాండ్‌ ఎంబ్రాయిడరీ, రాజశేఖర్‌ అనే ఆర్టిస్ట్‌ వేసిన జాలరుల జీవన చిత్రం, కేరళకు చెందిన మీర వేసిన ఆఫ్‌సెట్‌ పెయింటింగ్స్‌ సందర్శకులను ఆలోచింపజేస్తున్నాయి. మరోవైపు చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిత్రకళా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువతీ యువకులు తమ సృజనాత్మకతను సమున్నతంగా ఆవిష్కరించేందుకు ప్రత్యేక శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు.

ఒడిమా సాహిత్యంపై చెరగని ముద్ర

తమ రచనలతో సమకాలీన సాహిత్యాన్ని ఎంతో గాఢంగా ప్రభావితం చేసిన కొంతమంది రచయితలు, సాహితీవేత్తలు అనతి కాలంలోనే మరుగున పడిపోయారని ప్రముఖ ఒడియా రచయిత సచ్చిదానంద మొహంతి అన్నారు. హైదరాబాద్‌ లిటరరీ ఫెస్టివల్‌లో ఒడియా సాహిత్యంపై చెరగని ముద్ర వేసిన ఒకప్పటి ప్రముఖ రచయితలు సరళాదేవి, గోపీనాథ్‌ మొహంతీలపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. అనంతరం గోపీనాథ్‌ మొహంతి సాహిత్యంపై సుదీర్ఘ ప్రసంగించారు.

ఆటిజం ఒక ఆర్ట్‌...

ఆటిజంపై ఏర్పాటు చేసిన సెషన్‌లో ఇద్దరు రచయితలు తమ అనుభవాలను వివరించారు. బుద్ధిమాంద్యులైన పిల్లల నుంచి తల్లిదండ్రులు, సమాజం నేర్చుకోవాల్సిన అంశాలు అనేకం ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీకి చెందిన రచయిత దేబాశిష్‌ పాల్‌ బుద్ధి మాంద్యుడైన తన కుమారుడు టెన్నిస్‌ క్రీడాకారుడిగా ఎదిగిన తీరుపై ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన సీనారావు తాను రాసిన మైండ్స్‌ కేప్స్‌ పుస్తకం గురించి వివరించారు. ఇద్దరు రచయితలు బుద్ధిమాంద్యులైన తమ పిల్లల నుంచి తాము నేర్చుకున్న అనేక విషయాలను వివరించారు. ప్రముఖ రచయిత జావేద్‌ అక్తర్‌ రాసిన 'టాకింగ్‌ లైఫ్‌'పై నస్రీన్‌ మున్నీ కబీర్‌ మాట్లాడారు. 'మై సిటీస్‌ వేస్ట్‌ వేర్‌ డజ్‌ ఇట్‌ గో' అనే అంశంపై కల్పన శర్మ, పింకీ చంద్రన్‌ మాట్లాడారు. ఇంటర్‌ డిసిప్లినరీ క్లైమెట్‌ ఎడ్యుకేషన్‌ పై రాహుల్‌ చోప్రా ప్రసంగించారు. సాయంత్రం 'ది ఎండ్‌లెస్‌ మైండ్‌' విశేషంగా ఆకట్టుకుంది.